

# హైదరాబాద్ వార్త

# డీలిమిటేషన్‌పై 'తొలగిన అడ్డంకులు'

-వార్డుల విభజన ఆపలేమన్న హైకోర్టు
-ఒకట్రెండు రోజుల్లో జిహెచ్ఎంసి ఫైనల్ నోటిఫికేషన్
-వార్డుకు 40నుంచి 45 వేల మంది ఉండేలా చర్యలు
-జనాభా నిష్పత్తి ఆధారంగా రిజర్వేషన్లు -పలువార్డులకు పాతపేర్లనే కొనసాగింపు
-మరికొన్నింటికి మార్పులు చేర్పులు







**హైదరాబాద్,డిసెంబరు 22,ప్రభాతవార్త:** హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వార్డుల పునర్విభజన ప్రక్రియకు న్యాయపరమైన అడ్డంకులు తొలిగిపోయాయి. దీంతో ప్రస్తుతం ఉన్న 150 వార్డులను 300 వార్డులుగా మారుస్తూ ప్రభుత్వం త్వరలో తుది ఉత్తర్వులు జారీ చేయనుంది. ప్రతి వార్డుకు 45 వేల మంది జనాభా ఉండేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రజల నుంచి వచ్చిన సుమారు 5,905 అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం, ప్రజా సెంటిమెంట్‌ను గౌరవిస్తూ పాత పేర్లనే కొనసాగించాలని నిర్ణయించారు. దీంతో నగర విస్తీర్ణం, పెరిగిన జనాభాకు అనుగుణంగా వార్డుల సంఖ్యను పెంచాలన్న ప్రభుత్వ నిర్ణయం అమలుకు సిద్ధమైంది. వార్డుల విభజనపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన ఉన్నత న్యాయస్థానం ఈ ప్రక్రియను ఆపాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ముఖ్యంగా జనాభా లెక్కలు, మ్యాపుల విషయంలో స్పష్టత కోరిన వారికి అవసరమైన వివరాలు అందజేయాలని అధికారులను కోర్టు ఆదేశించింది. దీంతో పాలనాపరమైన అడ్డంకులు తొలగి తుది నిర్ణయానికి మార్గం సుగమమైంది. ముఖ్యంగా ఈ విభజన ప్రక్రియలో అధికారులు అత్యంత శాస్త్రీయ పద్ధతులను అనుసరించారు. 2011 జనాభా లెక్కలు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ దగ్గర ఉన్న తాజా గణాంకాలను పరిగణనలోకి తీసుకున్నారు. ప్రతి వార్డులో సగటున 45 వేల మంది జనాభా ఉండేలా ప్రణాళిక రూపొందించారు. దీనికి పది శాతం అటు ఇటుగా మార్పులు చేసే వెసులుబాటు కల్పించారు. ప్రస్తుతం ఉన్న 150 వార్డుల సంఖ్యను 300కు పెంచడం వల్ల ప్రతి ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం కలుగుతుంది.

**జనాభా నిష్పత్తి ఆధారంగా రిజర్వేషన్లు..**

కొత్తగా ఏర్పాటైన వార్డుల్లోని జనాభా నిష్పత్తికి అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. ఈ విషయంలో కూడా ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇలా ప్రక్రియలు ముగిశాక, ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. అలాగే వార్డుల పునర్విభజనలో పేర్ల మార్పుపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దశాబ్దాలుగా ఉన్న తమ ప్రాంతం పేరును మార్చడంపై స్థానికులు అభ్యంతరం తెలిపారు. ఈ సెంటిమెంట్‌ను గౌరవించిన ప్రభుత్వం, అధికారులు విభజన తర్వాత కూడా వీలైనంత వరకు పాత పేర్లనే కొనసాగించాలని నిర్ణయించారు. దీనివల్ల ప్రజల గుర్తింపు చెక్కుచెదరకుండా ఉంటుంది.

**సమస్యల పరిష్కారానికి పారదర్శకత..**

నగర పాలనలో వార్డుల సంఖ్య పెరగడం వల్ల నిధుల కేటాయింపులో, సమస్యల పరిష్కారంలో పారదర్శకత పెరుగుతుంది. గతంలో ఒక్కో కార్పొరేటర్ లక్షలాది మంది జనాభాకు ప్రాతినిధ్యం వహించాల్సి వచ్చేది.. దీనివల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం కష్టమయ్యేది. ఇప్పుడు వార్డు విస్తీర్ణం తగ్గడం వల్ల డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాల వంటి మౌలిక వసతులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ఇది రాజకీయ ప్రక్రియ మాత్రమే కాదు.. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చే క్రమంలో ఒక అనివార్యమైన ముందడుగుగా చెప్పుకోవచ్చు.

# ఆస్తిపన్ను వసూళ్లకు ఓటీఎస్ స్కీం

-90శాతం రాయితీతో వన్‌టైం సెటిల్‌మెంట్
-అసలు,వడ్డీ 10శాతం కడితే అంతా క్లియర్
-ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తులన్నింటికి వర్తింపు




**హైదరాబాద్, డిసెంబరు 22,ప్రభాతవార్త:** నగరవాసులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలోని ఆస్తిపన్ను బకాయిదారులకు భారీ ఊరటనిస్తూ వన్ టైమ్ స్కీమ్ (ఓటిఎస్)ను ప్రకటించింది. దీర్ఘకాలంగా పేరుకుపోయిన ఆస్తిపన్ను బకాయిలపై ఉన్న వడ్డీలో 90 శాతాన్ని మాఫీ చేస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈరాయితీ జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రైవేట్ ఆస్తులతో పాటు ప్రభుత్వ ఆస్తులకు కూడా వర్తిస్తుంది. ముఖ్యంగా బకాయి పడ్డ ఆస్తిపన్ను మొత్తంతో పాటు, దానిపై పేరుకుపోయిన వడ్డీలో కేవలం 10 శాతం చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన 90 శాతం వడ్డీని ప్రభుత్వం పూర్తిగా రద్దు చేస్తుంది. అయితే ఈ రాయితీని పొందాలంటే పన్ను మొత్తాన్ని అలాగే 10 శాతం వడ్డీని ఒకే విడతలో చెల్లించాల్సి ఉంటుంది. ఈపథకం 2025-26 ఆర్థిక సంవత్సరానికి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన బకాయిలను వసూలు చేయడంతో పాటు, పన్ను చెల్లింపుదారులపై ఉన్న వడ్డీ భారాన్ని తగ్గించాలన్న జీహెచ్ఎంసీ కమిషనర్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నగరవాసులు తమ ఆస్తిపన్ను బకాయిలను క్లియర్ చేసుకోవాలనిజిహెచ్ఎంసి అధికారులు కోరుతున్నారు.

# చెరువులోనే ప్లాస్టిక్ వ్యర్థాలు..

-వరద కాలువ కబ్జాలు ఆక్రమణలపై హైడ్రా ప్రజావాణికి 37 ఫిర్యాదులు

**హైదరాబాద్, డిసెంబర్ 22,ప్రభాతవార్త:** చెరువుల ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టి.. ప్లాస్టిక్ వ్యర్థాలతో జలాశయాలను కలుషితం చేస్తున్నారు. పక్కనే భూమి ఉన్న వారు అప్పటికే ఉన్నలే ఔట్లోకి 50 మీటర్ల మేర చొరబడి రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నారు. ఇక రహదారులు, పార్కుల గురించి పట్టించుకోకుండా.. అమ్మేయడం, ఆక్రమించడం వంటి ఫిర్యాదులు ప్రజావాణికి అందుతున్నాయి. దశాబ్దాల క్రితం నుంచి పార్కులు, రహదారులు, ప్రజావసరాల కోసం ఉద్దేశించిన స్థలాల పరిరక్షణకు పోరాడుతున్న వారు హైడ్రా ప్రజావాణికి హాజరై అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేశారు. గొలుసుకట్టు చెరువులు, నాలాల ప్రాముఖ్యతను పట్టించుకోకుండా.. కబ్జాలకు పాల్పడుతున్నారంటూ వాపోతున్నారు. నాలాలకు బఫర్ జోన్ వదలకపోవడమే కాదు.. వాటిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. ఆఖరుకు బస్సులు ఆపేందుకు ఉద్దేశించిన బస్సు స్టాపులను కూడా కబ్జా చేసేస్తున్నారని వాపోయారు. ఇలా సోమవారం నిర్వహించిన హైడ్రా ప్రజావాణికి 37 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా అడిషనల్ కమిషనర్ ఆర్. సుదర్శన్ పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలు అప్పగించారు.

**ఫిర్యాదులు ఇలా....**

ఎల్బీనగర్ మున్సిపాలిటీ హస్తినాపురంలోని వెంకటేశ్వర కాలనీ ఫేజ్ 2 లేఔట్ వేసినప్పుడు ప్రజారవాణా అందరికీ అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తూ.. 1200 గజాల స్థలాన్ని సిటీ బస్సు టర్మినల్(బస్సు స్టాప్)కోసం కేటాయిస్తే.. తప్పుడు పత్రాలతో దానిని కబ్జా చేస్తున్నారని వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బయట వారు వచ్చి ఈ భూమి తమదంటూ కబ్జా చేశారని.. తమ కాలనీతో పాటు.. చుట్టుపక్కల కాలనీలకు బస్సు సౌకర్యం కోసం ఉద్దేశించిన బస్సు టర్మినల్ను కాపాడాలని కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని అల్వాల్ కొత్త చెరువు ఆక్రమణలకు గురౌతోందని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. చెరువు ఎఫ్టీఎల్లోనే ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్లున్నాయని.. ఇక్కడ ఒక్కోసారి ప్లాస్టిక్కు తగులబెడుతుండడంతో కాలుష్యం వ్యాప్తి చెందుతోందని ఫిర్యాదు చేశారు. ఈ ప్లాస్టిక్ పరిశ్రమతో పాటు.. పలు అక్రమ కట్టడాలను వెంటనే తొలగించి.. కొత్త చెరువును కాపాడాలని కోరారు. . రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం పసుమాముల గ్రామంలోని కృష్ణానగర్ లే ఔట్లోకి పక్కనే ఉన్నవారు 50 అడుగుల మేర జరిగారని కృష్ణనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో 41 ప్లాట్ల హద్దులు మారిపోయాయని.. వారి స్థలం కబ్జాకు గురైందని పేర్కొన్నారు. 25 అడుగుల రహదారి కూడా మాయమైందని.. వెంటనే మా లే ఔట్ ప్రకారం రహదారిని యథాప్రకారం ఉండేలా చూడాలని కోరారు. .. సికింద్రాబాద్ మచ్చబొల్లారంలోని విజయ విహార్ ఎన్క్లేవ్ లే ఔట్ ప్రకారం రహదారితో పాటు.. పిల్లలు ఆడుకునే పార్కు స్థలం కబ్జాలకు గురౌతోందని.. వెంటనే కాపాడాలని అక్కడి నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. నాలాను కూడా ఆక్రమించేసి నిర్మాణాలు చేపట్టారని.. వెంటనే ఈ నిర్మాణాలను ఆపకపోతే.. వర్షాకాలంలో వరదలకు ఆస్కారం ఇచ్చినట్టౌతోందని వాపోయారు.

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం చందానగర్ పోలీసు స్టేషన్ దగ్గరలోని గంగారం చెరువు నుంచి దిగువున ఉన్న అమీన్పూర్ చెరువుకు వెళ్లాల్సిన వరద కాలువ కబ్జాకు గురౌతోందని సీపీఐ(ఎం) పార్టీ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నాలాను ఆక్రమించడమే కాకుండా.. వరద నాలాపై స్లాబు వేసి నిర్మాణాలు చేపడు తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# గ్రామీణ పేదలకు ఉపాధిని దూరం చేసేందుకు బిజెపి కుట్ర

-సిపిఐ జాతీయ నాయకులు నారాయణ

**బేగంపేట డిసెంబర్ 22,ప్రభాతవార్త:** గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఎంతో మంది పేదలకు ఉపాధి కల్పిస్తూ పేదరికం దూరం చేస్తున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి గాంధీ పేరు తొలగించడం అంటే గ్రామీణ పేదలకు ఉపాధిని దూరం చేయడమేనన్నారు.కేంద్ర ప్రభుత్వం చేసిన సవరణలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్యారడైజ్ ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద నిరసన ధర్నాను ఉద్దేశించి సీపీఐ జాతీయ నాయకులు నారాయణ మాట్లాడుతూ జీ రామ్ జి చట్టాన్ని తక్షణమే రద్దుచేసి ఎంజీఎన్ఆర్ఈజీపీ చట్టాన్ని యధాతధంగా పునరుద్ధరించాలని డిమాండ్ చేసారు.వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వలసలు పేదరికం నిర్మూలించబడ్డాయన్నారు.అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో పేద,మధ్యతరగతి ప్రజలకు ఉపాధికి ఇబ్బంది లేకుండా సంవత్సరంలో వంద రోజులు పని కల్పించడం జరిగిందన్నారు.ఇలాంటి పథకానికి నిధులు కేటాయించకుండా పేరు మారుస్తూ నెమ్మదిగా ఎంజీఎన్ఆర్ఈజీపీ చట్టాన్ని ఎత్తి వేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.ఈ చట్టాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సీపీఎం నేత రాఘవులు తదితరులు ప్రసంగించారు.ఎంజీఎన్ఆర్ఈజీపీ చట్టాన్ని కాపాడుకోవాలన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రేమపావని,ఛాయాదేవి,స్టాలిన్,కమతం యాదగిరి, కాంతయ్య,నేర్లకంటి శ్రీకాంత్,కాంపల్లి శ్రీనివాస్,సలీంఖాన్,సీపీఎం నేతలు పాల్గొన్నారు.




ఎంజీ రోడ్డు గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలియజేస్తున్న వామపక్షపార్టీలు.

# రాచకొండ కమిషనరేట్‌లో 4 శాతం పెరిగిన నేరాలు

-ఏడాదిలో 33,040 ఎఫ్ఐఆర్‌లు -పెరిగిన కిడ్నాప్, ఫోక్సో కేసులు



రాచకొండ కమిషనరేట్ వార్షిక నివేదికను విడుదల చేస్తున్న సిపి సుధీర్‌బాబు, ఇతర అధికారులు

**ఉప్పల్, డిసెంబరు 22 ప్రభాతవార్త :** రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత ఏడాది కంటే ఈ ఏడాది మరో 4 శాతం నేరాలు పెరిగినట్లు రాచకొండ సిపి జి.సుధీర్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్‌లోని ఎస్‌విఎం గ్రాండ్‌లో జరిగిన కార్యక్రమంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ వార్షిక నివేదికను పలువురు పోలీసు అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపి సుధీర్‌బాబు మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది మరో 4 శాతం పెరిగాయని, 2024లో మొత్తం 28,626 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఈ సంఖ్య 33,040కు పెరిగిందని అన్నారు. మహిళలపైనా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 4 శాతం అధికంగా నేరాలు నమోదైనట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 21,056 కేసులను (78 శాతం) పరిష్కరించామని, 12 కేసుల్లో దోషులకు 20 ఏళ్ల జైలుశిక్ష పడేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అడ్డగూడూరు పీఎస్ పరిధిలో జరిగిన హత్య కేసులో 17 మంది నిందితులకు జీవిత ఖైదు పడిందని, సైబర్ నేరాలకు పాల్పడిన వారిపై 3,734 కేసులు నమోదు చేశామని తెలిపారు. 6,188 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశామని, సైబర్ క్రైమ్ బాధితులకు రూ.40.10 కోట్లను రిఫండ్ చేశామని పేర్కొన్నారు.డ్రగ్స్ రవాణా చేస్తున్న 495 మందిని అరెస్టు చేసి రూ.20 కోట్లు విలువ చేసే మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇందులో తెలంగాణకు చెందిన వారు 322 మంది, ఇతర రాష్ట్రాల చెందిన వారు 172 మంది, ఒక విదేశీయుడు ఉన్నారని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 227 ఎన్డీపీఎస్ అనుమానిత షీట్లను తెరిచామని, నాన్ బెయిల్ వారెంట్ ఫ్రీ కమిషనరేట్‌గా రాచకొండను తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ ఏడాది వార్షిక నేర గణాంకాలు ప్రకారం..579 కిడ్నాప్ కేసులు, 1224 పోక్సో కేసులు,దోపిడీ కేసులు 3, దొంగతనాలు 67, ఇళ్లలో చోరీలు 589, వాహనాల చోరీలు 876, సాధారణ చోరీలు 1,161, హత్యలు 73, అత్యాచారాలు 330, వరకట్నం మరణాలు 12, గృహ హింస కేసులు 782 నమోదైనట్లు సిపి సుధీర్ బాబు తెలిపారు.

**మహిళలపై 4 శాతం పెరిగిన నేరాలు :** రాచకొండ కమిషనరేట్ పరిధిలో గత ఏడాది వరకట్న హత్య కేసులు 3 నమోదు కాగా, ఈ ఏడాది 6 ఉన్నాయని, వరకట్న మరణాలు గతంలో 18 ఉండగా, ఈ ఏడాది 12 ఉన్నాయని సిపి సుధీర్‌బాబు తెలిపారు. ఆత్మహత్యకు ప్రేరిపించడం కేసులు గత ఏడాది 61 ఉండగా, ఈ ఏడాది 52 ఉన్నాయని, వేధింపులు, గృహ హింస కేసులు గత ఏడాది 1222 ఉండగా ఈ ఏడాది 782 ఉన్నాయని తెలిపారు. గత ఏడాది 384 మంది మహిళలపై అత్యాచారాలు జరుగగా ఏడాది 330 జరిగినట్లు సిపి తెలిపారు.

**రాచకొండ పరిధిలో తగ్గిన సైబర్ నేరాలు :** రాచకొండ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాలు 19 శాతం తగ్గినట్లు సిపి సుధీర్‌బాబు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పించడం వల్ల నేరాల సంఖ్య తగ్గించగలిగినట్లు తెలిపారు. అన్ని కళాశాలలు, సంస్థలలో దీనిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు సిపి తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు అందిన వెంటనే ఆరు నిమిషాలలోనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుంటున్నారని తెలిపారు. నేరాల నివారణకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో మల్కాజిగిరి డిసిపి సి.హెచ్. శ్రీధర్, ఎల్‌బినగర్ డిసిపి బి.అనురాధ, మహేశ్వరం డిసిపి కె.నారాయణరెడ్డి, యాద్రాద్రి డిసిపి అకాన్ష్‌యాదవ్, ఎస్‌ఓటి డిసిపి ఎ.రమణారెడ్డి, అడిషనల్ డిసిపి షేక్ హుస్సేన్, సైబర్ క్రైం డిసిపి ఎస్.వి.నాగలక్ష్మి, మహిళ సెఫ్టీ వింగ్ డిసిపి టి.ఉషారాణి, క్రైం డిసిపి గుణశేఖర్, ట్రాఫిక్ డిసిపి డి.శ్రీనివాస్, వి.శ్రీనివాసులు, రోడ్డు సెఫ్టీ డిసిపి కె.మనోహర్, అడ్మిన్ డిసిపి పి.ఇందిర, అడిషనల్ డిసిపి కె.శివకుమార్, స్పెషల్ బ్రాంచీ డిసిపి జి.నరసింహారెడ్డి, సిసిఆర్‌బి ఎసిపి జె.రమేష్‌కుమార్, సంపత్‌కుమార్, మల్కాజిగిరి ఎసిపి ఎ.చక్రపాణి, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# హుస్సేన్‌సాగర్ వద్ద ఎన్డీఆర్ఎఫ్ మాక్‌డ్రిల్



**హైదరాబాద్, డిసెంబరు 22,ప్రభాతవార్త:** వరదలు, విపత్తుల సమయంలో బాధితులను రక్షించే తీరుపై ఎన్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ సిబ్బంది వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహించారు. సోమవారం నెక్లెస్‌రోడ్‌లోని వ్యూ పాయింట్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ సలహాదారు సుధీర్ బెహరా, తెలంగాణ ఫైర్ డీజీవిక్రమ్సింగ్ మాన్ హాజరయ్యారు.అనంతరం ఎన్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ సిబ్బంది.. నీటిలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకుతీసుకురావడం, ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయిన మత్స్యకారులను రక్షించడం, బోటుఅందు బాటులో లేనప్పుడు రిమోట్ కంట్రోల్ బోట్లతో బయటకు రావడం, మునిగిపోతున్న వ్యక్తినిగజ ఈతగాళ్లు తీసుకొచ్చే విధానం, సీపీఆర్ చేయడం, వైద్య సిబ్బంది ఆస్పత్రికి తరలించడం వంటిఅంశాలపై ప్రదర్శన నిర్వహించారు.

## ఊహాశక్తిని పెంచే సాధనాలు పుస్తకాలే

### పుస్తక ప్రదర్శనలో బాలల పుస్తకాల ఆవిష్కరణ




బాలల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న శాంతాసిన్హా, ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

**ముషీరాబాద్, డిసెంబర్ 22, ప్రభాతవార్త:** పిల్లల ఊహాశక్తిని పెంచే సాధనాను పుస్తకాలేనని, పుస్తకాలు చదివే అలవాటు అధికం చేయాలని ప్రముఖ రచయిత శాంతా సిన్హా సూచించారు. సోమవారం ఎన్టీఆర్ స్టేడియంలోని 38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లోని కొంపెల్లి వెంకట్‌గౌడ్ వేదికపై బాలల పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంకు ఆమె ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ, సోషల్ మీడియా ప్రభావంతో పిల్లల్లో పుస్తకాలు చదివే ఆశక్తి బాగా తగ్గిందని అన్నారు. బాలల సాహిత్యంలో కొంత ఫన్, డిస్కవరీలు ఉంటే పిల్లలు ఎంజాయ్ చేస్తారని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనేక భాషలు అంతరించి పోతున్న ఈ తరుణంలో తెలుగులో పుస్తకాలు రచించి, తెలుగును బతికిస్తున్న వేదకుమార్ వంటి రచయితలకు ధన్యవాదములని, అదే విధంగా బాలల కోసం ప్రత్యేక గ్రంధాలయాలను స్థాపించటం ఎంతో గొప్పవిషయమని కొనియాడారు. డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ బాలల సాహిత్యం ఆంగ్లంలో కూడా వెలువడాల్సిన అవసరం ఉందన్నారు. గరిపెల్లి అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు ఎస్.రఘు, బాలల చెలిమి సంస్థ వ్యవస్థాపకులు వేదకుమార్, బుక్‌ఫెయిర్ అధ్యక్షులు కవి యాకుబ్ పాల్గొన్నారు.

**సామాజిక చైతన్యానికి ప్రధాన మెట్టు పుస్తకం: ప్రొఫెసర్ పార్ధసారధి**

సామాజిక చైతన్యానికి ప్రధాన మెట్టు పుస్తకమని ప్రొఫెసర్ పార్ధసారధి అన్నారు. 38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లోని అనిశెట్టి రజిత వేదికపై పుస్తక స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా పుస్తకం దారి దీపం అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్ధసారధి మాట్లాడుతూ ఒక పుస్తకం మన పాత భావాలను మార్చి కొత్త ఆలోచనలను రేకెత్తించినప్పుడే దానికి సార్ధకత చేకూరుతుందని అన్నారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి మాట్లాడుతూ మారుమూల పల్లెలో, నిరక్షరాస్య తల్లితండ్రులకు పుట్టిన తనను ఈ స్థాయికి తెచ్చింది పుస్తకాలేనని తెలిపారు.

## మైనర్ బాలుడిపై కత్తులతో దాడి

### -దాడికి ప్రేమ వ్యవహారమే కారణమా?

**సరూర్‌నగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** హైదరాబాద్ శివార్లలోని ఎర్రగుంటలో ఓ మైనర్ బాలునిపై కత్తులతో హత్యాయత్నం జరిగింది. తీవ్ర గాయాల పాలైన బాధితుడు ఉస్మానియా ఆసుపత్రిలో చావుబతుకల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రగుంటలో సోమవారం తెల్లవారు జామున కంటే ముందు ఈ ఘాతుకం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వట్టెపల్లి నుండి ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు రిహాన్ (17)తో పాటు అతని స్నేహితులు షానవాజ్, మోహిజ్‌లు ఎర్రకుంటకు బయలు దేరారు. అయితే ఎర్రగుంటకు వచ్చిన తర్వాత ప్రేమకు సంబంధించి ఓ అమ్మాయి విషయంలో గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఎర్రకుంటలోనే రిహాన్‌పై కత్తులతో దాడి చేశారు. దీంతో కడుపులో తీవ్ర గాయాలు కావడంతో బాధితుడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా దాడికి పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలని రిహాన్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## డ్రగ్స్,గంజాయి స్వాధీనం..యువకుల అరెస్టు



**అత్తాపూర్ డిసెంబర్ 22,ప్రభాతవార్త :** డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని పక్కా సమాచారంతో దాడులు జరిపి రాజేంద్రగన్ జోన్ ఎస్ఓటీ పోలీసులు డ్రగ్స్, గంజాయిన్ని పట్టుకున్నారు.పోలీసులు వివరాల ప్రకారం...పక్కా సమాచారంతో సోమవారం రాయదుర్గం పరిధిలోని లివింగ్ గార్నెట్ పిజి హాస్టల్ వద్ద దాడులు చేసి పలువురు యువకుల నుండి 12 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్ ఓజి, ఏడు గ్రాముల గాంజా,అదేవిధంగా ఆరు సెల్‌ఫోన్లు , 60 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితులను అరెస్టు చేసి యూరిన్ టెస్ట్ శాంపిల్స్ సేకరించి రాయదుర్గం పోలీసులకు అప్పగించారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న రాయదుర్గం పోలీసులు పీజీ హాస్టల్ కి సంబంధించిన సిసి ఫుటేజ్ లతోపాటు ఇంకా కొన్ని కోణాలలో దర్యాప్తు చేపట్టారు.

## ఏసు ప్రభువు బోధనలు సర్వమతాలు ఆచరించదగ్గవి


సెమీక్రిస్మస్ వేడుకలలో బహుమతులు అందజేస్తున్న చింతల్ టిఆర్ఎస్ అధ్యక్షులు మహ్మద్‌రఫీ, ఫాస్టర్ ఇజ్ర తదితరులు

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 22 ప్రభాతవార్త**

ఏసు ప్రభువు బోధనలు అన్నివర్గాలకు ఆచరణయోగ్యమైనవని చింతల్ డివిజన్ టిఆర్ఎస్‌అధ్యక్షులు మహ్మద్‌రఫి అన్నారు. సోమవారం సెమిక్రిస్మస్ ఉత్సవాలలో భాగంగా హెచ్ఎంటి కాలనీ యునైటెడ్ చర్చిలో జరిగిన ప్రార్థనలలో ఆయన పాల్గొన్నారు. యునైటెడ్ హోలీచర్చి పాస్టర్ ఇజ్రా, సభ్యులు రామ్‌చంద్రుడు, సంధ్య, వసంత, సంతోశ్, విలియమ్స్, మంజు, గీత, విక్కి, షాదు ల్లా, సాయికిరణ్‌లతోపాటు పలువురు పాల్గొని ప్రత్యేకప్రార్థనలు చేశారు.

## కురుమ సంఘం అభివృద్ధి కోసం కృషి : సాయి కిరణ్


సాయి కిరణ్‌కు మెమోంటో అందజేస్తున్న రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు మల్లేశం కురుమ

**చార్మినార్, డిసెంబరు 22 ప్రభాతవార్త :** కురుమ సంఘం అభివృద్ధి కోసం తన శాయ శక్తుల కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం యూత్ సలహాదారులు సాయి కిరణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన నలభై ఆరవ దసరా, దీపావళీ సమ్మేళనం కార్యక్రమంలో రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ వై.మల్లేశం కురుమ పాతబస్తీ కిషన్‌బాగ్ ఎస్‌పినగర్‌కు చెందిన సాయి కిరణ్‌ను శాలువ కప్పి సన్మానించి మెమోంటోను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సాయి కిరణ్ మాట్లాడుతూ అన్ని విధాల కురుమ సంఘం అభివృద్ధికి పాటు పడతానని తెలిపారు.

## పాతబస్తీ బాయిస్ టౌన్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బ్రదర్ శౌరెడ్డి, బ్రదర్ ఆరోగ్యం పసాలా

**చార్మినార్, డిసెంబరు 22, ప్రభాతవార్త :** పాతబస్తీ జహానుమాలోని సెయింట్ మార్క్స్ బాయిస్ టౌన్ హైస్కూలో సోమవార ం ఘనంగా క్రిస్మస్ మేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సెయింట్ మార్క్స్ బాయిస్ టౌన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ శౌరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో గొప్పగా క్రిస్మస్ వేడుకలను జరుపుకుంటున్నారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ ఆరోగ్యం పసాలా మాట్లాడుతూ ఇతరులను ప్రేమించడం, సహాయం చేయటం క్రిస్మస్ సందేశమని తెలియజేశారు. క్రిస్మస్ సందర్భంగా పలు స్వచ్ఛంధ సంస్థలు, అనాధాశ్రమాలలో ఆహార వస్తువులుపంపిణీ చేశామని ఆయన తెలిపారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాయిస్ టౌన్ హైస్కూల్ డైరెక్టర్ యేసు ప్రభహరన్, మీడియా ఇంఛార్జి ఓం ప్రకాష్ దిల్లీకర్, కల్పనాదేవి శర్మ పాల్గొన్నారు.

## అక్రమార్కులపై చర్యలు తీసుకోండి : కొండల్‌రెడ్డి


ప్రభుత్వభూమికబ్జాపై డీసీకి ఫిర్యాదు చేసిన కొండల్‌రెడ్డి, కాలనీ వాసులు

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 22 ప్రభాతవార్త**

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలను చేపడుతున్న అక్రమార్కులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి డిప్యూటి కమిషనర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. పాపిరెడ్డినగర్ ప్లాట్‌నంబర్ 1827కి చెందిన వ్యక్తులు రోడ్డును కబ్జాచేసి ప్రహరీ గోడను నిర్మాణం చేశారని, అదే విధంగా చందానగర్ సర్వేనంబర్ 322,324లోని మదీనాగూడ సర్వేనంబర్ 48లోని గ్రామాల మధ్య ఉన్న మిగులు భూమిలో ప్రిన్‌కాన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో ఓ వ్యక్తి దొంగ డాక్యుమెంట్లను సృష్టించి ఖాళీ స్థలాన్ని, రోడ్డును కబ్జాచేసి అమ్ముకునా న్నరని ఆరోపించారు. ప్రస్తుం సదరు సర్వేనంబర్లలో అక్రమ నిర్మాణాలు జరుగు తున్నాయని, వాటిపై సమగ్రంగా విచారణ జరిపి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శేరిలింగంపల్లి డిప్యూటి కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. డీసీని కలిసిన వారిలో బస్తీవాసులు ఎస్‌పి రెడ్డి, టీ.నర్సింహా, కుమార్‌గుప్త, ప్రవీణ్‌గుప్త, రాజేశ్, కళ్యాణ్, సోను తదితరులు ఉన్నారు.

## నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు


తాగునీటి సమస్య పరిష్కారంకు రూ.3.5కోట్ల నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు.

**నార్సింగి, డిసెంబర్ 22 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ సర్కిల్ పరిధిలోని పద్మశ్రీహిల్స్ కాలనీ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ రూ.3.5కోట్ల నిధులను మంజూరు చేయించారు. దీంతో బండ్లగూడ కార్పోరేషన్ మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేత క్యాతం పాపయ్య నేత తదితరులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పద్మశ్రీహిల్స్ కాలనీలో గత కొంత కాలంగా నీటి ఇబ్బందులు ఉన్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి నిధులు మంజూరు చేయించాలని కోరారు. శాశ్వతంగా నీటి ఇబ్బందులు దూరం చేయాలన్న ఉద్దేశంతో ఈ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేయించాలని జల మండలి అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. వెంటనే అధికారులు ఈ ట్యాంకు నిర్మాణం కు అవసరమైన ఎస్టిమేట్లు వేసి ఎమ్మెల్యేకు అందజేశారు. ఉన్నతాదికారులతో ప్రకాశ్‌గౌడ్ మాట్లాడి రూ.3.5.కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో నాయకులు, కాలనీ వాసులు ఉమామహేశ్వర్, ప్రతాప్‌రెడ్డి తదితరులు సోమవారం ఎమ్మెల్యేను కలిసి ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

# 30న వైకుంఠ ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు


వైకుంఠ ఉత్సవాల బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**జియాగూడ, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** పాత నగరం మూసినది సమీపంలోని జియాగూడ చారిత్రత్మాకమైన రంగనాథ స్వామి దేవస్థానంలో వైకుంఠ ముక్కోటి ఏకాదశి ఉత్సవాలనున ఈనెల 30వ తేది నుంచి జనవరి 3వ తేది వరకు నిర్వహిస్తుననట్లు దేవాలయ వ్యవస్థాపక ట్రస్టీ ఎస్.టి.చారి, నిర్వాహకులు శేషాచార్యులు, ప్రతినిధులు బద్రినాథ్‌చార్యులు అర్చకులు శ్రీనివాస్ రంగనాథాచార్యులుపేర్కొన్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుకుగా ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. 30న తెల్లవారు జామున 5గంటలకు గరుడ వాహనంపై శ్రీమన్నారాయణుడు ఉత్తరద్వారం నుంచి భక్తులకు దర్శనమిస్తాడన్నారు. వైకుంఠ దర్శనం ఐదు రోజుల పాటు జనవరి 3వ తేదినవరకు ఉంటుందన్నారు. కార్పొరేటర్లు గొంటి శంకర్‌యాదవ్, బోహిని దర్శన్, కుల్సుంపురా ఇన్‌చార్జ్‌ఏసిపి ఎస్.సుదర్శన్, కుల్సుంపురా ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఠాకూర్‌జీవన్‌సింగ్, తెలంగాణ ఉద్యమకారులు యాద శ్రీనివాస్‌గుప్త, బిజెపి నాయకులు బి.శివకుమార్ యాదవ్ లు మాట్లాడుతూ రంగనాథ ఆలయంలో వైకుంఠ ఉత్సవాలను తిలకించేందుకు తెలంగాణతోపాటుపలు దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూడా లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యంకలుగకుండా జిహెచ్ఎంసి, ఆర్.అండ్.బి, జలమండలి, విద్యుత్ తదితర శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. శాంతి భద్రత విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. వరుసగా భక్తులు దర్శనం చేసుకునేలా బారికేడ్లతో క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్.అండ్ బి అధికారులు తెలిపారు. జలమండలి తరుపున భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద 10లక్షల వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు మంతటి నర్సింహ్మా, సందీప్, వివిధ శాఖల అధికారులు, ఆలయప్రతినిధులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి



చింతల్ భగత్‌సింగ్‌నగర్‌లో స్వచ్ఛ్ సర్వేక్షన్ ర్యాలీలో పాల్గొన్న గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డి, భగత్‌సింగ్‌నగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు పచిమట్ల నరేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్ ప్రతాప్‌రెడ్డి, పూర్వ అధ్యక్షులు కొండల శ్రీనాథ్‌రావు, బీసు వెంకటేశ్‌గౌడ్ తదితరులు

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 22 ప్రభాతవార్త**

పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రతిఒక్కరికీ అవగాహన ఆవశ్యకమని గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డి అన్నారు. చింతల్ భగత్‌సింగ్‌నగర్ సంక్షేమసంఘ అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలో స్వచ్ఛ్ సర్వేక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డి మాట్లాడుతూ కాలనీ సంక్షేమసంఘం పరిసరాల పరిశుభ్రతపట్ల ప్రత్యేకశ్రద్ధ కనబర్చి ప్రజలను చైతన్యవంతంచేయాలని సూచించారు. భగత్‌నగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడే ఇళ్ల నిర్మాణాలకు సంబందించి చెత్తా, చెదారం పేరుకుపోవడం, తమ వాహనాలను సైతం రోడ్డుకు ఇరువైపులా నిలుపుతుండటంతో బస్తీప్రజలు వాహనాలకు చాటుగా చెత్త, చెదారాలను వేస్తున్నారని దీనిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. ప్రతిగల్లీలో స్థానికులను సమీకరించి చెత్త రోడ్లపై వేయడంవల్ల కలిగే అనర్థాలను వివరించి చెప్పడంతోపాటు చట్టపరంగా వారిని గుర్తించి ఫెనాల్టీకూడా విధించి ప్రజల్లో చైతన్యం తెస్తామని గాజులరామారం ఉపకమిషనర్ మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు పచిమట్ల నరేదర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి ఎస్.ప్రతాప్‌రెడ్డి, పూర్వ అధ్యక్షులు కొండల శ్రీనాథ్‌రావు, నాయకులు వెంకటేశ్, బీసు వెంకటేష్‌గౌడ్, మిక్చర్ రాములు, ఈశ్వర్, శ్రీధర్‌గౌడ్, మల్లేష్, వెంకటేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, నాగరాజు, బూషి నరేందర్ గౌడ్, కుమార్, సూపర్‌వైజర్లు రామకృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

## పింగళి వెంకయ్య చరిత్ర విస్తృత ప్రచారం కల్పించిన ఘనత జగదాంబకు దక్కుతుంది


పురస్కారాలను ప్రధానం చేస్తున్న శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదన చారి, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి

**చిక్కడపల్లి డిసెంబర్ 22 (ప్రభాతవార్త ) :** జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య ను ప్రతి ఒక్కరు స్మరించుకునే విధంగా కెహెచ్ ఎస్ జగదాంబ నేతృత్వంలో పింగళి వెంకయ్య ట్రస్ట్ ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారాన్ని కల్పించిన ధీశాలి అని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదన చారి, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి అన్నారు. సోమవారం ఆకాష్ ఇంటర్నేషనల్ ఆధ్వరంలో వివిధ రంగాలకు చెందిన వారికి జీవన సాఫల్య పురస్కారాలు, స్వర్ణకంకణ ప్రధానం, గాత్రరత్న, నృత్య రత్న అవార్డుల ప్రధానోత్సవ సభ జరిగింది. గత కొన్ని రోజుల కింద తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన జగదాంబ తరపున వారి కుటుంబసభ్యులు అందుకున్నారు. అనంతరం అతిధులు మాట్లాతుడుతూ ట్రస్ట్ ద్వారా పెద్ద సంఖ్యలో సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ట్రస్ట్ ద్వారా మహోన్నత శిఖరాలను అధిరోహించిన గొప్ప మహిళా జగదాంబకే దక్కుతుందని పేర్కొన్నారు. పురస్కారాలు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని అన్నారు. ముఖ్య అతిధులుగా హాజరైన సిరికొండ మధుసూదన చారి, సముద్రాల వేణుగోపాల చారి చేతులమీదుగా కె హెచ్ ఎస్ జగదాంబ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక సంస్థ అధ్యక్షుడు జీఎంజి అర్జున్, స్వచ్ఛ భరత్ డిస్ట్రిక్ట్ సెక్రెటరీ బి.విజయ్ రంగ, బింగి నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు మానసికోల్లాసం శ్రీవేంకటేశ్వర స్తోత్రమంజరి : డా. కె.వి.రమణాచారి


రెండు గ్రంథాలను ఆవిష్కరిస్తున్న రమణాచారి పుష్పలత దంపతులు, కళ్యాణశ్రీ, ప్రభాకర్, రఘుశ్రీ తదితర అతిథులు

**నాంపల్లి, డిసెంబరు 22 ప్రభాతవార్త :** డా. వేదాస్తం ఆంజనేయ కుమారస్వామి రచించిన శ్రీ వేంకటేశ్వర స్తోత్రమంజరి భక్తులకు మానసోల్లాసం, భక్తిప్రపత్తులను కలిగిస్తూ ఆధ్యాత్మికతాపశాన్తిని చేస్తుందని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. శ్రీ వేంకటేశ ప్రాతస్స్మరణమ్‌తో ప్రారంభించి శ్రీ వేంకటేశ శరణాగతి స్తోత్రమ్ వరకు 18 స్తోత్రములను ఎంపికచేయడం తెలుగు భావార్థములతో బండారుపల్లి రామచంద్రరావు స్తోత్ర సంకలనం చేయడం అత్యంత అద్భుతం పఠించే భక్తులకు సులభంగా అర్థమయ్యేరీతిలో ఉందని, ప్రతీఒక్కరూ ఈ గ్రంథాన్ని తప్పక చదవాల్సిందేనని రమణాచారి స్పష్టం చేశారు. అలాగే మానస సంస్థ కార్యదర్శి రఘుశ్రీ రచించిన హైకూలు వినూత్నం, నూతనం, ఆకర్షితమే కాక ఆలోచింపజేసి పాఠకులను, ముఖ్యంగా నేటితరం, యువతను ఎంతగానో ఆకట్టుకునే సులువుగా అర్థమయ్యేటట్లు రచించారని కొనియాడారు. మున్ముందు వచన రచనలు కావించాలని రఘుశ్రీకి రమణాచారి సూచించారు. శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి.రమణ క్యాంపు కార్యాలయంలో ప్రముఖ ఆధ్యాత్మిక గాయకుడు కడియాల ప్రభాకర్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన డా. కె.వి.రమణాచారి, పుష్పలత దంపతులు విశిష్ట అతిథులు జంధ్యాల వెంకటరామశాస్త్రి, గ్రంథాల రచయితలు ఆంజనేయ కుమారస్వామి, రఘుశ్రీ, స్తోత్ర సంకలనకర్త రామచంద్రరావు తదితరులతో కలిసి శ్రీ వేంకటేశ్వర స్తోత్రమంజరి; హైకూలు గ్రంథాలను ఆవిష్కరించి రచయితలు ఎంతగానో ప్రశంసించి శుభాభినందనలు తెలిపారు. సభకుముందు జరిగిన కవిసమ్మేళనంలో పలువురు కవులు తమ కవితలను ఆలపించి విచ్చేసిన అశేషప్రేక్షకులను అలరించి తన్మయుల్ని చేశారు.

# ఉపా చట్టాన్ని రద్దు చేసి, ఇన్నయ్యను విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్. చిత్రంలో ఎన్.నారాయణరావు తదితరుల

**సైఫాబాద్, డిసెంబరు 22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఉపా చట్టాన్ని రద్దు చేయాలని, అక్రమంగా అదుపులోకి తీసుకున్న సామాజిక కార్యకర్త, తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్యను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. దేశంలో పౌరులకు ఉన్న వాక్ స్వాతంత్ర్యంపై ప్రభుత్వాలు నిర్బంధాన్ని కొనసాగిస్తున్నాయని, పాలకులు అధికారంలోకి రాకముందు నక్సల్స్ ఏజెండాను అమలు చేస్తామని ప్రగల్భాలు పలుకుతారని, అధికారంలోకి వచ్చిన తరువాత నక్సలిజం లేకుండా చేస్తామని ప్రకటిస్తున్నారని సంఘం నాయకులు ఆరోపించారు. సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు మాట్లాడుతూ అర్బన్ నక్సలైట్ల పేరిట ప్రభుత్వాలు ప్రజా సంఘాల నాయకులను టార్గెట్ చేస్తున్నాయని ఆరోపించారు. ఈ వైఖరిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విమరమించుకోవాలని డిమాండ్ చేశారు. గాదె ఇన్నియ్య జఫర్గడ్ మండల రేగరడి తండాలో అనాధశ్రామంనడుపుతూ 400 మంది అనాథ పిల్లలకు సంరక్షకుడిగా కొనసాగుతున్నారని, ఆయన ఒక సభలో పాలకులను విమర్శించారనే నేపంతో పదుల సంఖ్యలో మఫ్టిలో ఉన్న పోలీసులు చుట్టుముట్టి అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. తక్షణమే ఇన్నయ్యను విడుదల చేయాలని, చట్టబద్ధ పాలన కొనసాగించాలని, వ్యక్తి స్వేచ్ఛను, రాజకీయ స్వేచ్ఛను కాపాడాలని అపెరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, ఆదివాసీల ప్రత్యేక రక్షణ చట్టాలను అమలు చేయాలని, పర్యావరణాన్ని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు బాలకృష్ణ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## పి.వి.రావు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడు


పి.వి.రావు, కాకా, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న జి.చెన్నయ్య

**సైఫాబాద్, డిసెంబరు 22 ప్రభాతవార్త:** దళితులు, పేదల సంక్షేమం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.రావు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య కొనియాడారు. చివరి శ్వాస వరకు రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేశారని ఆయన చెప్పారు. సోమవారం ఏసీ గార్డ్స్‌లోని ఏటూరి టవర్స్‌లో జరిగిన పి.వి.రావు 20వ వర్ధంతి, కే ంద్ర మంత్రి జి.వెంకటస్వామి (కాకా) 11వ వర్ధంతి సభలో ఆయన ప్రసంగించారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు కూడు, గూడు అందించాలని అను నిత్యం వెంకటస్వామి పరితపించారని, కార్మికుల కోసం ఆనేక చట్టాలను తీసుకువచ్చారని ఆయన తెలిపారు. పి.వి.రావు, వెంకటస్వామి ఆశయాలను, లక్ష్యాలను కొనసాగించడమే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వారు అంబేద్కర్, పి.వి.రావు, వెంకటస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## సెక్యూరిటీ గార్డులకు సౌకర్యాలు కల్పించడంలో సంస్థలు ముందుండాలి : ఐజీ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రమేష్

**జూబ్లీహిల్స్, డిసెంబరు 22, ప్రభాతవార్త:**

ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు సౌకర్యాలు, హక్కులు కల్పించడంలో సంస్థల అధినేతలు ముందుండాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రమేష్ అన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించేందుకు అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ(ఏపిఎస్ఏ) మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో సోమవారం ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ వెల్ఫేర్ సమ్మిట్‌ను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతలు కాపాడటంలో ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలు చేస్తున్న కషి ఎనలేనిదని, కోవిడ్ సమయంలో వారు చేసిన సేవలు మరిచిపోలేమని అన్నారు. వారి సేవానిరతి ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. ఇదే విధంగా సెక్యూరిటీ గార్డులు ప్రతి ఒక్కరిలో భగవంతుడ్ని చూస్తూ సేవ చేయాలన్నారు. మరోవైపు వారికి సరైన సౌకర్యాలు కల్పించడంలో కంపెనీ అధినేతలు ముందుండాలని పోలీసు శాఖ వారికి అన్ని రకాల సహాయసహకారాలు అందించడానికి ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలను ఎంచడం, వేతన సవరణ చట్టం వంటి అంశాలపై చర్చించారు. 44 ఏళ్ల క్రితం ప్రారంభమైన ప్రైవేట్ సెక్యూరిటీ వ్యవస్థ ప్రాముఖ్యత వారికి కల్పించాల్సిన సౌకర్యాలు, ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అప్సా పనిచేస్తుందన్నారు. ఇందులో చర్చించిన అంశాలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామన్నారు. దేశంలో 50వేల సెక్యూరిటీ ఏజెన్సీలు ఉన్నాయని, దాదాపు కోటిమంది పనిచేస్తున్నారు. దేశంలోనే మొదటిసారి సెక్యూరిటీ గార్డుల సంక్షేమం కోసం ఓ కార్యక్రమం అప్సా చేపట్టిందని దీని తర్వాత దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడతామని సెక్యూరిటీ గార్డుల సంక్షేమమే అప్సా పరమావధని ఆ సంస్థ చైర్మన్ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టడం గర్వంగా వుందని మాజీ డీజీపీ స్వరణ్ జిత్ సేన్ అన్నారు. ప్రభుత్వాలు కార్మిక చట్టాలను తప్పకుండా పాటించి వారికి వేతన సవరణ చేపట్టాలని ప్రభుత్వలను డిమాండ్ చేశారు. వేరే రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలుగు రాష్ట్రాల్లో గార్డులకు వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. వేతన సవరణ చేస్తే వారికి స్కిల్ ఉన్న గార్డులు అందించగలమని అప్సా తెలిపింది. పలువురు గార్డులకు ఇక్కడ అవార్డులను అందించారు కార్యక్రమంలో సెక్యూరిటీ టుడే ఎడిటర్ జీబీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## జనవరి1 నుండి శాసనమండలిలో తెలుగులోనే అన్ని కార్యకలాపాలు : గుత్తా సుఖేందర్ రెడ్డి


వివిధ రంగాలకు చెందిన వారికీ తెలుగు వెలుగు పురస్కారాలను ప్రధానం చేస్తున్న తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, చిత్రంలో డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి, కె.ధర్మా రావు, సి.రామకృష్ణ తదితరులు

**చిక్కడపల్లి డిసెంబర్ 22 (ప్రభాతవార్త ) :** వచ్చే సంవత్సరం జనవరి ఒకటవ తేదీ నుండి తెలంగాణ శాసన మండలి తెలుగులో అన్ని కార్యకలాపాలు ప్రారంభించబోతున్నట్లు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా లలిత కళావేదికలో సాంస్కృతిక సారస్వత సంఘం "ఇట్కాలా", 30 వార్షికోత్సవం సందర్భంగా వివిధ కళా రంగాలలో దశాబ్దాలుగా సేవలందిస్తున్న లబ్ద ప్రతిష్టులకు తెలుగు వెలుగు" పురస్కారాల ప్రధానోత్సవ సభ నిర్వాహక సంస్థ అధినేత, సంస్కృతిరత్న డాక్టర్ కె .ధర్మారావు నేతృత్వంలో జరిగింది. గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిధి గా హాజరై పురస్కారాలను ప్రధానం చేసి ప్రసంగించారు. మాతృబాష ను మరింత ప్రాచుర్యం కలిగించాలని సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించామని అన్నారు. భాషను, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక డైరెక్టర్ డా.ఏనుగు నరసింహారెడ్డి పురస్కార గ్రహీతలను అభినందించారు .ఇట్కలా సంస్థ సన్మాన అధ్యక్ష లు సంస్కృతిరత్న డా కె ధర్మారావు సభకు అధ్యక్షత వహించారు, పురస్కార గ్రహీత లు రచయిత ఆచార్య మసన చెన్నప్ప, "పేరిణినృత్య" దుంపేటి ప్రకాశ్ , గాయకుడు జితమోహనమిత్ర లకు విశ్వతెలుగు వెలుగుపురస్కారాలు, పౌరాణిక నటుడు బాబురాజు సాంస్కృతికనిర్వహకుడు ఏ.సురేందర్, పాత్రికేయుడు యన్. రమేష్ బాబు లకు " ఇట్కాలా తెలుగు వెలుగు పురస్కారములను అందించి గౌరవించారు. దక్షిణమధ్య రైల్వే పూర్వ జనరల్ మేనేజర్ సి.రామకృష్ణ, రైల్వే కార్మిక నాయకుడు పి.యుగంధర్, మంత్రి భుజంగ రావు, కెవి భాను మూర్తి, యస్ రాజు, భేరా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సొంతింటి కల సాకారం దిశగా అడుగులు : టీయుడబ్ల్యూజే

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 22 ప్రభాతవార్త**

దశాబ్ధాలుగా శేరిలింగంపల్లి నియోజక వర్గ జర్నలిస్టులు ఎదురుచూస్తున్న సొంతింటి కల సాకారం దిశగా అడుగులు పడుతున్నాయని టీయూడబ్ల్యూజే నాయకులు తెలిపారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని చందానగర్ పీజేఆర్ స్టేడియంలో సోమవారం శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పైల్ల విఠల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఉప్పరి శేఖర్‌సగర, ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేశ్ సగరలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు, మీడియా అకాడమీ మాజీ ఛైర్మన్ అల్లం నారాయణ అండదండలతో శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ సహకారంతో చందానగర్‌లో శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం గత ప్రభుత్వం 1ఎకర స్థలాన్ని కేటాయించిదన్నారు. సదరు స్థలంలో జర్నలిస్టులకు సొంతింటి కలను సాకారం చేసేందుకు టీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబల ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ నాయకులు, టెంజు కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సర్వేయర్‌ను నియమించాలని వినతి


గండిపేట మండలంలో సర్వేయర్‌ను నియమించాలని జిల్లా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం.

**నార్సింగి, డిసెంబర్ 22 ప్రభాతవార్త :** గండిపేట మండలంకు ఇద్దరు సర్వేయర్లను నియమించాలని కోరుతూ నార్సింగి సహకార సంఘం మాజీ చైర్మన్ తోలుకట్ట కృష్ణ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ గండిపేట మండలంలో పూర్తిస్థాయి సర్వేయర్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నిమార్లు గండిపేట తహసీల్దార్‌ను సర్వేయర్ కోసం అడిగినా మూడు మండలాలకు ఒకే సర్వేయర్ ఉన్నాడని, ఎప్పుడు అతడు ఇక్కడికి వస్తాడో అప్పుడు మీ వినతుల ప్రకారం సర్వే చేయిస్తామని పేర్కొంటున్నారని తెలిపారు. తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని రైతులు, ప్రజలు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. గండిపేట మండలం చాలా పెద్దగా ఉందని, ఇక్కడే ఇద్దరు సర్వేయర్లు పని చేయాల్సిన అవసరం ఉంటుందని, వెంటనే సర్వేయర్లను నియమించాలని కృష్ణ వినతిపత్రంలో కోరారు.

## బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ కోర్ట్ డైరీ ఆవిష్కరణ

**...తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్**


బార్ అసోసియేషన్ ఆఫ్ లేబర్ కోర్ట్ రూపొందించిన 2026 నూతన సంవత్సర డైరీని ఆవిష్కరిస్తున్న జస్టిస్ పుల్ల కార్తీక్

**చిక్కడపల్లి డిసెంబర్ 22 ప్రభాతవార్త :**

లేబర్ కోర్ట్ కు సమాచారం అధారంగా బార్ అసోసియేషన్ అఫ్ లేబర్ కోర్ట్ తీసుకురావడం విశేషమని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు పుల్ల కార్తీక్ అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ అఫ్ లేబర్ కోర్ట్ రూపొం దించిన 2026 నూతన సంవత్సర డైరీని జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జి. విద్యాసాగర్, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రఘురాం రెడ్డి, ఎం.మధుసూదన్, సభ్యులు వచ్చా తిరుపతి రెడ్డి, వై రంజిత్ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.


తెలంగాణ హోమియోపతి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హోమియోపతిలో చేసిన పరిశోధనలకు గాను ద్యావ వరనకు సర్టిఫికేట్ ప్రదానం చేస్తున్న డాక్టర్ దుర్గా ప్రసాద్, చిత్రంలో డాక్టర్ గణేష్ ఆచార్య, డాక్టర్ రఘుపతిరెడ్డి, డాక్టర్ కావ్య తదితరులు


బంజారాహిల్స్‌లో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## జూబ్లీహిల్స్‌లో బెంజి కారు బీభత్సం

**జూబ్లీహిల్స్, డిసెంబరు 22, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్‌లో ఒక బెంజి కారు భీభత్సం సృష్టించిన సంఘటన ఇది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. మణిపూర్‌కు చెందిన కేవెచుహిలో లోహా(25) బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో నివసిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత దాదాపు 2 గంటల సమయంలో తన స్నేహితుడు సంజయ్‌తో కలిసి మాదాపూర్ నుంచి బంజారాహిల్స్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన బెంజ్ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో లోమాకు తీవ్ర గాయాలవ్వగా, సంజయ్‌కు స్వల్పంగా గాయలయ్యాయి. ఈ సంఘటనలో బెంజీ కారు ముందుభాగంతోపాటు ద్విచక్రవాహనం బాగా దెబ్బతిన్నాయి. కాగా బెంజి కారు నడిపిన వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. లోహా ఫిర్యాదుపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో ..

మద్యం మత్తులో కారు భీభత్సం సృష్టించిన సంఘటన ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. టోలిచౌకి సమీపంలోని బాస్ జ్యూస్ సెంటర్ వద్ద ఆదివారం తెల్లవారుజామున 3.45 గంటల ప్రాంతంలో వేగంగా వచ్చిన ఒక కారు ముందు వెళ్తున్న మరో కారును బలంగా ఢీకొట్టింది. అనంతరం కారు అదుపుతప్పి పాదబాటను ఢీకొట్టింది. ఈ సంఘటనలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. కాగా కారునడుపుతున్న వ్యక్తిని పోలీసు లు శ్రేయాస్‌గా గుర్తించారు. అతనికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష లు నిర్వహించగా మద్యం సేవించినట్లు గుర్తించారు. శ్రేయాస్‌పై సెక్షన్ 110, 281 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డుపై వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు.. 10 మందిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, డిసెంబరు 22, ప్రభాతవార్త:**

పంజాగుట్టలో రోడ్డుపై జన్మదిన వేడుకలు చేసుకొని న్యూసెన్స్‌కు పాల్పడిన పది మంది యువకులపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పోలీసులు పంజాగుట్ట ఎక్స్ రోడ్‌లోని మోనప్ప జంక్షన్ వద్ద దాదాపు పది నుంచి 20 మంది యువకులు రోడ్డును బ్లాక్ చేసి గుమిగూడినట్లు కనిపించారు. విచారించగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఎలాంటి అనుమతి తీసుకోకుండా చేస్తున్నట్లు గుర్తించారు. అనుమతి లేకుండా రోడ్డుపై వేడుకలు నిర్వహించి న్యూసెన్స్‌కు పాల్పడవద్దని గుమిగూడిన వారిని వెళ్లిపోవాలని పోలీసులు సూచించనప్పటికి వారు పెడచెవిన పెట్టారు. కేక్‌ను కత్తిరించి వేడుకలు నిర్వహించారు. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తాయి. దీనికితోడు పోలీసు విధులను అడ్డుకున్నారు. ఈ సంఘటనపై కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నికిల్ వర్మ, రామకృష్ణ, వంశీ, అశోక్ రెడ్డి, రామిరెడ్డి, మురళీకృష్ణ, ఈశ్వర్‌రెడ్డి, రాజ్ రతన్, శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజశ్రీనివాస నగర్‌లో ఆర్‌సీసీ పైప్‌లైన్‌కు చర్యలు

**:కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్**



**నేరెడ్‌మెట్, డిసెంబర్ 22,ప్రభాతవార్త :** గౌతమ్ నగర్ డివిజన్ సమగ్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మిర్జాల్‌గూడలోని రాజశ్రీనివాస నగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ సర్కిల్ అధికారులతో కలిసి పర్యటించి, కాలనీలోని మౌలిక వసతుల సమస్యలను పరిశీలించారు. డ్రైనేజీ సమస్యలపై కాలనీవాసులు చేసిన విజ్ఞప్తి మేరకు, కాలనీలో ఆర్‌సీసీ పైప్‌లైన్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సర్కిల్ ఏఈ దివ్యజ్యోతికి సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సహకారంతో గౌతమ్ నగర్ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, నర్సింగ్ రావు, కిట్టు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరించిన తోటకూర వజ్రేష్ యాదవ్



నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రష్ యాదవ్ , పోగుల నర్సింహారెడ్డి, బొమ్మక్ విశ్వనాథ్ ,బొమ్మక్ కళ్యాణ్ ,బొమ్మక్ చరణ్, బుంగ కుమార్ తదితరులు

**బోడుప్పల్, డిసెంబర్ 22 ప్రభాతవార్త ;** బొమ్మక్ శంకరయ్య కన్వెన్షన్ హాల్ నూతన సంవత్సర 2026 క్యాలెండర్‌ను మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ , బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ పోగుల నర్సింహ్మారెడ్డి , సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొమ్మక్ విశ్వనాథ్ , మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్ , స్వర్గీయ బొమ్మక్ నర్సింగ్ రావు తనయుడు బొమ్మక్ చరణ్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ .. బోడుప్పల్ మాజీ వార్డు సభ్యులు, టీడీపీ పార్టీ అధ్యక్షులుగా బొమ్మక్ నర్సింగ్ రావు ఎన్నో సామాజిక కార్యక్రమాలు, బోడుప్పల్ అభివృద్ధి లో పాలుపంచుకున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మరాటి మల్లేష్ ,పడతం లోకేష్ ,జానీ యాదవ్ ,బుంగ కుమార్ ,పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి

**: డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ**




ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 22, ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మలక్ పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మహమ్మద్ ఇంకేషాఫ్ అలీ పేర్కొన్నారు. మలక్ పేట బిబ్లాక్స్ లోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తున్నామని వివరించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంహెచ్ఓ రుద్ర భాస్కర్, అసిస్టెంట్ కమిషనర్ సంజయ్, షాబుద్దీన్ పాల్గొన్నారు.

## బోడుప్పల్‌లో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ

**బోడుప్పల్, డిసెంబర్ 22 ప్రభాతవార్త ;** హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 12వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇల్లు భూమిపూజ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ , మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్ కుమార్ , మేడ్చల్ నియోజకవర్గ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ , దానగల్ల యాదగిరి , ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ నగర్ ఫేజ్-2 అధ్యక్షుడు నరేందర్ , బషీర్, మధు ,అంబేద్కర్ నగర్ ఫేజ్-3 అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి సత్యం చారి, క్యాషియర్ మురళి, జాయింట్ సెక్రటరీ రాహుల్, యాకూబ్, లక్ష్మయ్య, ఉత్తమ్, అజయ్, నాగయ్య,సందీప్, అరుణ్, శ్రీకాంత్, ఉదయ్, కె.అజయ్, రోషన్,నాగరాజ్,జంగయ్య,రాము,అంబేద్కర్ నగర్ కాలనీ అధ్యక్షుడు ఊరటి మహేష్, ప్రధాన కార్యదర్శి రహీం ,కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఇందిరమ్మ ఇల్లు కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

## కాలనీల్లో సమస్యలు లేకుండా చూస్తాం

**: కొప్పుల నర్సింహ్మ రెడ్డి**



సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్

**హయత్‌నగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తానని మన్సురా బాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్ లో భాగంగా ఆయన సోమ వారం డివిజన్ పరిధిలోని విష్ణు నగర్ కాలనీ, సీఎస్ఆర్ కాలనీ ఫేస్ 2 లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విష్ణునగర్ కాలనీలో దాదాపుగా సీసీ రోడ్లు పూర్తయ్యాయని తెలిపారు. జరిగింది. కొత్తగా నిర్మాణాలు జరిగే చోట ముందుగా భూగర్భ డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తిచేసి అనంతరం సీసీ రోడ్లను వేస్తామన్నారు. జాతీయ రహదారి నుండి బృందావన్ కాలనీ, విజయనగర్ కాలనీ మీదుగా విష్ణునగర్ కాలనీ నుండి శివం హిల్స్ కాలనీకి చేరుకునే రోడ్డును కూడా తొందరలోనే పూర్తి చేస్తా మని తెలిపారు. సీఎస్ఆర్ కాలనీలో నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపి... కాలనీలో సమస్యలను పర్యవేక్షించారు. జరిగింది. సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే వాటిని పరిష్కరిస్తా మన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు సింహాద్రి, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ గౌడ్, మధు నాయక్, లింగ స్వామి గౌడ్, రవిగౌడ్ పాల్గొన్నారు.

## జనవరి 11 నుంచి శ్రీకరణ్ బాగ్ మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవం : లక్ష్మారెడ్డి

**మలక్ పేట, డిసెంబర్ 22, ప్రభాతవార్త:** ఆస్మాన్ ఘాడ్ కరణ్ బాగ్ లోని శ్రీ మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలను జనవరి 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయం కమిటీ ప్రతినిధులు మడిగల లక్ష్మారెడ్డి, క్రోసిక కృష్ణులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయంలో ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. జనవరి 11వ తేదీ ఆదివారం ఉదయం 5 గంటలకు మేలుకొలుపు, అభిషేకం, బిల్వార్చన, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, సాయంత్రం 6 గంటలకు గంగ తెప్ప, శ్రీ మల్లన్న స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాలుఊ నిర్వహించనునట్లు తెలిపారు. జనవరి 12వ తేదీ సోమవారం ఉదయం మేలుకొలుపు, అభిషేకం, అలంకరణ, అర్చనలు, ఉదయం 10 గంటలకు శ్రీ బలిజ మేడలాదేవి, శ్రీ గొల్ల కేతమ్మ సమేత శ్రీ మల్లన్న స్వామి వారి కళ్యాణం, మధ్యాహ్నం 1గంటకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జనవరి 13వ తేదీ మంగళవారం సాయంత్రం శ్రీ రేణుక ఎల్లమ్మ, శ్రీ నల్ల పోచమ్మ, శ్రీ మహంకాళి అమ్మ వార్లకు బోనాలు, వడి బియ్యం, ముత్తైదువులకు పసుపు, కుంకుమ, కొత్త గాజులు అందజేయడం జరుగుతుందని వివరించారు. ఉత్సవాలను పురస్కరించుకొని దేవాలయానికి చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని వారు వివరించారు ఈ కార్యక్రమంలో ఈటల వి ఎన్ వి. సత్యనారాయణ, మధుసూదన్ రావు, మారుతీ, రాములు తదితరులు పాల్గొన్నారు.




దేవాలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దేవాలయం ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాడిగల లక్ష్మారెడ్డి, కోసిక కృష్ణ తదితరులు

## డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో ఆకట్టుకున్న సాంస్కృతిక ఉత్సవం

**నాచారం, డిసెంబర్ 22 ప్రభాతవార్త :** డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వార్షిక సాంస్కృతిక ఉత్సవం, ఇనారా 2.0 ను నిర్వహించింది. ఇది రెండు రోజుల పాటు జరిగే శ్రేష్ఠత, సృజనాత్మకత, వారసత్వ వేడుక. ఈ సంవత్సరం ఇతివృత్తం, సర్వోత్కృష్ట భారత్ ప్రదర్శించబడింది. ఇది భారత్ యొక్క ప్ శక్తివంతమైన ప్రదర్శనలు మరియు ఉత్సవ నివాళుల ద్వారా భారతదేశం యొక్క గొప్ప సాంస్కృతిక దారాలను అందంగా కలిపింది. మొదటి రోజు ఛైర్మన్ శ్రీ నవనీత రావు స్ఫూర్తిదాయకమైన ప్రసంగంతో ప్రారంభమైంది, తరువాత మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ నవీన్ కుమార్, సమగ్ర విద్య పట్ల పాఠశాల నిబద్ధతను నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రఖ్యాత కళాకారిణి, సాంస్కృతిక రాయబారి శ్రీమతి గీతా భాస్కర్, విద్యార్థుల కళాత్మక వ్యక్తీకరణలను మరియు ప్రతిభను పెంపొందించడంలో పాఠశాల అంకితభావాన్ని ప్రశంసించారు. రెండవ రోజు శ్రీ కట్టా చంద్రశేఖర్ రెడ్డి, ,తిళీ, వారి ఉనికి ఈ సందర్భాన్ని మరింతగా పెంచింది. తన ముఖ్య ఉపన్యాసంలో, యువ అభ్యాసకులలో పౌర విలువలు మరియు సాంస్కృతిక అక్షరాస్యతను పెంపొందించడంలో పాఠశాల ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖుల ప్రసంగాలు, ప్రావీణ్యం, స్థిరత్వ అవార్డుల ప్రదానంతో ఉత్సవ ప్రారంభం జరిగింది. సాంస్కృతిక విభాగం, "ప్రస్తావనా ది సెరిమోనియల్ ఓడ్ టు ఎక్సలెన్స్", శాస్త్రీయ మరియు సమకాలీన నృత్యాల నుండి సంగీత నివాళులు మరియు నేపథ్య నాటకావరకు అద్భుతమైన ప్రదర్శనలను ప్రదర్శించింది ఇది భారత్ యొక్క ఐక్యత మరియు వైవిధ్యాన్ని జరుపుకునే గ్రాండ్ ఫినాలేలో ముగిసింది. ఆపరేషన్స్ కోర్ హెడ్ కిషోర్ కుమార్ రెడ్డి.ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల అచంచలమైన అంకితభావం మరియు ఉత్సాహభరితమైన భాగస్వామ్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రతిభను జరుపుకోవడమే కాకుండా పాఠశాల సమాజం యొక్క ఉమ్మడి విలువలు మరియు ఆకాంక్షలను కూడా బలోపేతం చేస్తాయని వారు నొక్కి చెప్పారు.




సన్మానిస్తున్న ఎండీ నవీన్ కుమార్

## వైఎస్ఆర్ కాలనీలో వరద, బురద రోడ్డు సమస్యను పరిష్కరిస్తా : మల్లారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసిలోని బడంగ్‌పేట్ సర్కిల్‌లో 57వ డివిజన్ పరిధి కిందకు వచ్చే అల్మాస్‌గూడకు సంబంధించిన జయశంకర్ కాలనీ నుండి విశాఖనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో వైఎస్ఆర్‌నగర్ ఫేస్-2 కాలనీ మెయిన్ రోడ్డుపై నీటి వరద, బురద సమస్యను పరిష్కరిస్తామని సర్కిల్‌కు సంబంధించిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి స్పష్టం చేశారు. గత కొంత కాలంగా తరచూ ఈ రోడ్డుపై నీరు ప్రవహిస్తూ బురదమయంగా మారి ఇబ్బందులకు గురి చేస్తున్న నేపథ్యంలో స్థానిక కాలనీవాసులు ఈ సమస్యను మల్లారెడ్డి దృష్టికి తెచ్చారు. ఈ మేరకు స్పందించిన ఆయన సోమవారం స్థానికంగా పర్యటించి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన కొన్నేళ్లుగా అల్మాస్‌గూడ, కాలనీల ప్రజలు తన దృష్టికి తెచ్చిన పలు సమస్యలను మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కెఎల్ఆర్‌తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించడం జరిగిందని వెల్లడించారు. ముఖ్యంగా డ్రైనేజీ, రోడ్ల సమస్యలను తీర్చడం జరిగిందని ఆయన వెల్లడించారు. అదే విధంగా ఈ సమస్యను కూడా వారి దృష్టికి తీసుకెళ్ళి సత్వరమే పరిష్కారం అయ్యే విధంగా శాయశక్తులా కృషి చేస్తానని మల్లారెడ్డి స్థానిక కాలనీవాసులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య గౌడ్, శ్రీనివాసచారి, శంకర్, గిరి, రాములు పాల్గొన్నారు.



వరద, బురదతో మడుగులా తయారైన అల్మాస్‌గూడ వైఎస్ఆర్‌నగర్ ఫేస్-2 కాలనీ రోడ్డును పరిశీలిస్తున్న నవారు మల్లారెడ్డి

## రామంతాపూర్ వంశరాజ్ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**రామంతాపూర్, డిసెంబరు 22 ప్రభాతవార్త :** రామంతపూర్ వంశరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కొత్త సంవత్సరం తెలుగు క్యాలెండర్‌ను సోమవారం అవిష్కరించారు. రామంతాపూర్‌లో జరిగిన కార్యక్రమానికి ప్రొ.కోదండరాం, సామాజికవేత్త జయధీర్ తిరుమలరావు, మానవ హక్కుల ఫోరం సభ్యులు జీవన్‌కుమార్, కవి గాయకుడు అంబటి వెంకన్న తదితరులు పాల్గొని వంశరాజ్ సంక్షేమ సంఘం క్యాలెండర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రొ.కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జెఏసి ఇచ్చిన ప్రతి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్ల గడిచినా వారికి తగు గుర్తింపు దక్కలేదని, వారికి తగు చేయూత ఇవ్వాలని సూచించారు. వంశరాజ్ కులస్తులను విద్య ఉపాధి ఆర్థిక రాజకీయ పరంగా ప్రభుత్వాలు సహకరించాలని సూచించారు. సామాజికవేత్త జయదేవ్ తిరుమల్‌రావు మాట్లాడుతూ కులాల ఉనికిని, ఉపకులాలను కాపాడుకోవడం, కులాల చరిత్ర, వంశపారంపర్య కలలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. వంశరాజ్ సంఘం అభివృద్ధికి తగు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు చిటికెల కృష్ణయ్య వంశరాజ్, అధ్యక్షులు రాసాని బాలస్వామి వంశరాజ్, ప్రధాన కార్యదర్శి ఇరగ జీవా తిరుపతయ్య వంశరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాయసం గోపాల్ వంశరాజ్, చిన్న కృష్ణ, వెంకటయ్య, నరసింహ, వేణు, కాశయ్య, బాలు, వీర స్వామి,రాము శ్రీను ,వంశరాజ్ కులస్తులు పాల్గొన్నారు.



రామంతాపూర్ వంశరాజ్ సంక్షేమ సంఘం క్యాలెండర్ అవిష్కరిస్తున్న ప్రొ.కోదండరాం, జయధీర్ తిరుమల్‌రావు, జీవన్‌కుమార్ తదితరులు

## బ్రాహ్మణ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**సరూర్‌నగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి పరిధిలోని బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సంఘం 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ ఘనంగా జరిగింది. స్థానిక కాశీబుగ్గలోని శ్రీ పద్మావతి ఆలివేలు మంగా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రాహ్మణ అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్ కో-ఆర్డినేటర్ నందిరాజు లక్ష్మీనారాయణ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చక్రవర్తుల మదన్మోహనాచార్యులు నందూరిప్రకాశ్, తుంగతుర్తి మోహన్‌రావు, ఆకెళ్ళ అనూరాధ, రత్నాకర్‌రావు, శ్రీరామమూర్తి, కవిత, నవీన్‌కుమార్, మధుసూదన్‌రావు, రవికుమార్, ఉమాశంకర్‌రావు, నరేందర్, శ్రీనివాసరావు, మైథిలి, మాధురి శ్రీనివాస్, పావని, నవీన జ్యోతి,ఇందిరాదేవి, వరలక్ష్మి పాల్గొన్నారు.

## నిలిచిపోయిన చిలుకానగర్ స్మశానవాటిక పనులు : బిజెపి

**ఉప్పల్, డిసెంబరు 22 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లోని హిందూ స్మశానవాటికలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని , పనులు వేగవంతం చేయాలని బిజెపి సీనియర్ నేత గోనె శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు సోమవారం బిజెపి అధ్యక్షులు డప్పు దత్తసాయి ఆధ్వర్యంలో పలువురు బిజెపి నేతలతో కలిసి ఉప్పల్ డిప్యూటి కమిషనర్ జి.రాజును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గోనె అంజయ్య, వెద్యుల వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శులు తన్నీరు కొండల్ రావు, శివకుమార్,తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ కుమ్మరిబస్తీలో ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

**ఉప్పల్, డిసెంబరు 22 ప్రభాతవార్త :** ఉప్పల్ కుమ్మరిబస్తీలో సోమవారం అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అయ్యప్పస్వామి పూజలు భక్తి శ్రద్దలతో చేసుకోవాలని సూచించారు. భక్తులకు తగు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆకిటి ఆగంరెడ్డి, వల్లపు శ్రీకాంత్ యాదవ్, శ్రీకాంత్, అనూప్‌చారి, జగదీష్, నాగరాజు, బీమ్ ముదిరాజ్, మణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఘంటసాల జయంతి వేడుకలు

**వనస్థలిపురం. డిసెంబర్. 22 ప్రభాతవార్త.** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శారదా నగర్ పార్కు లో కళాభారతి సాంస్కృతిక సేవ సంస్థ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వర రావు 103 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాయనీగాయకులచే సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. విభావరి కార్యక్రమంలో డాక్టర్. వై. శివరామ ప్రసాద్,తంగిరాల అరుణ్ కుమార్,సి.ఎచ్.శ్రీధర్ రావు, యాదగిరి, నారాయణ రావు,టి. యాదగిరి రావు,రాఘవేంద్ర, రాజేంద్రప్రసాద్, సిఎచ్.ఉష,నివేదిత, బ్రాహ్మణి,చిన్మయి తదితరులు మద్దురమైన గీతాలతో శ్రోతలను రంజిం పజేశారు.అనంతరం గాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి కె.ఎల్. నర్సింహారావు,కళా భారతి కన్వీనర్ కొప్పోలు జగన్నాథ రావు,ప్రసన్నాంజనేయులు, డాక్టర్.ఎస్. అప్పారావు, హనుమం తరావు, ప్రసాద్,ప్రముఖ రంగస్థల నటులు మల్లాది వెంకటరమణ, రామ్మోహన్ రావు,సి.ఎచ్.వి.ఆర్.కె.మూర్తి,శర్మ తదితరులు పాల్గొన్నారు. కళాభారతి సేవ సంస్థ స్థాపించి 25 సంవత్సరాలు అయ్యిందని కొప్పోలు జగన్నాధ రావు తెలిపారు




గాయకులను సన్మానిస్తున్న కళా భారతి సభ్యులు

## చైనా మాంజా అమ్మితే క్రిమినల్ కేసులు

**: ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్**



**నేరెడ్ మెట్, డిసెంబర్ 22,ప్రభాతవార్త :** చైనా మాంజాలను అమ్మిన కొనుగోలు చేసిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ హెచ్చరించారు.రాబోయే సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కైట్ షాపులను పోలీసులు సోమవారం తనిఖీ లు చేశారు. చైనా మాంజా అమ్మకాలు, వినియోగం పూర్తిగా నిషేధమని, ఉల్లంఘించిన వారిపై కొత్త బీఎన్ఎస్ సెక్షన్లతో పాటు స్పెషల్ లోకల్ లాజ్‌లోని పర్యావరణ చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ హెచ్చరించారు.చైనా మాంజా వలన గతంలో పలువురు తీవ్ర గాయాల పాలవడమే కాకుండా, వాహనదారుల మెడలకు చుట్టుకుని ప్రమాదాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. అలాగే చెట్లు, విద్యుత్ తీగలపై వేలాడే మాంజాలో పక్షులు చిక్కుకుని మరణిస్తున్నాయని పేర్కొన్నారు.ప్రకృతి సమతుల్యతను కాపాడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చైనా మాంజాను నిషేధించిందని స్పష్టం చేశారు.నేరేడ్మెట్ పరిధిలో ఎక్కడైనా చైనా మాంజా అమ్మకాలు,వినియోగం జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను ఇన్స్పెక్టర్ కోరారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభం



**మల్కాజిగిరి డిసెంబర్ 22 ప్రభాతవార్త ;** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని న్యూ శ్రీనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ 10 లక్షలతో ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మురికి నీరు పొంగి పొరలు అవుతున్నారని డ్రైనేజీ కావాలని కోరడం జరిగింది అలాగే మంజీరా వాటర్ సమస్యను పరిష్కరించాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఎండి రషీద్ బక్క ఏబీఎన్ భక్త సలోమి సంపూర్ణ సుజాత ప్రభావతి కాలనీవాసులతోపాటు బాబు సత్యనారాయణ సంపత్ రావు కిషోర్, శంకర్రావు వాజిద్ తదితరులు పాల్గొన్నారు

## వెంకటేశ్వర వీకర్ సెక్షన్ కాలనీ అధ్యక్షుడుగా రాంబాబు



వెంకటేశ్వర వీకర్ సెక్షన్ కాలనీ నూతన కమిటీ సభ్యులు.

**వనస్థలిపురం డిసెంబర్22,ప్రభాతవార్త** సాహెబ్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర వీకర్ సెక్షన్ కాలనీ అధ్యక్షుడు గా పాటి రాంబాబు గౌడ్ ఎన్నికయ్యారు. ప్రజాస్వామ్య విధానం లో బ్యాలెట్ పద్ధతి లో జరిగిన కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో పాటి రాంబాబు గౌడ్ అధ్యక్షుడు గా, ఉపాధ్యక్షుడు గా మొగుతాళ్ల రాజు గౌడ్,ప్రధానకార్యదర్శి గా మాల్లోజు లక్ష్మణాచారి,కోశాధికారి గా బొమ్మరాజు శ్రీను,సంయుక్త కార్యదర్శి గా వి.జైపాల్ నాయక్,కార్యవర్గ సభ్యులుగా చింతకాయల లక్ష్మయ్య, రావుల రమేష్‌లు ఎన్నికైనట్లు ఎన్నిల అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు గౌడ్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో కాలనీ అభివృద్ధి కి కృషి చేస్తామన్నారు. తమ విజయానికి సహకరించిన కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరం



మందులను పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

**నాచారం, డిసెంబర్ 22 ప్రభాతవార్త :** నాచారంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. శ్రీ వెంకటేశ్వర భక్త సమాజం లో నిర్వహించిన వైద్య శిబిరం లో సత్య సాయి బాబా సేవ సమితి, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారం తో దాదాపు 250 మంది కి వైద్య పరీక్షలు నిర్వహించి ఉంచితంగా మందులు అందించడమే కాకుండా కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాల అందచేశారు. ఉచితంగా వైద్యం, మందులు మరియు కంటి అద్దాలు అందించడంపై స్థానికంగా ఉన్న పేద ప్రజలు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం నాచారం గౌరవ అధ్యక్షుడు సింగిరికొండ నరసింహ, అధ్యక్షుడు బండల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బొగ్గారపు రమేష్, కోశాధికారి ఎగిన భాస్కర్, ఉపాధ్యక్షుడు గౌరి శెట్టి నరేందర్, సలహాదారులు జూలూరి శ్రీనివాస్, ఏం.రమేష్, జాయింట్ సెక్రటరీ గుండా మహేశ్వమూర్తి,మీడియా కోఆర్డినేటర్ ఆకుతోటి హరిష్, కార్యవర్గ సభ్యులు, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రేమ్ కుమార్, సాయి బాబా, శ్రీశైలం, డా. రాజేంద్ర ప్రసాద్, డా. ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## లార్డ్స్‌లో గణిత శాస్త్ర వారోత్సవాలు

**సరూర్‌నగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్‌లోని లార్డ్స్ పాఠశాలలో సోమవారం గణిత శాస్త్ర వారోత్సవాలను నిర్వహించారు. ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు గణిత ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. లార్డ్స్ ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్ల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలతల ప్రోత్సాహంతో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామిడి సంతోష్, ఇంఛార్జి రేఖా సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లార్డ్స్ విద్యార్థులు తయారు చేసిన గణిత ప్రాజెక్ట్‌లు

## బిఆర్ఎస్ నేత పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి పితృ వియోగం



పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి మీర్‌పేట్ సర్కిల్‌లోని జిల్లెలగూడకు చెందిన సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి పోరెడ్డి లక్ష్మారెడ్డి సోమవారం తెల్లవారు జామున ఆకస్మిక మృతి చెందారు. ఈ నేపథ్యంలో సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే మీర్‌పేట్ తీగల బాల్‌రెడ్డి (టిబిఆర్) కాలనీలోని పోరెడ్డి నివాసానికి తరలివచ్చి లక్ష్మారెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు అనంతరం పితృ వియోగంలోనున్న ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు పోరెడ్డి రాజేందర్‌రెడ్డిలను పరామర్శించి మనోధైర్యంతో ఉండాలని సూచించారు. ఎమ్మెల్యేతో పాటు పోరెడ్డి సోదరులను మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ అర్కల భూపాల్‌రెడ్డి, మీర్‌పేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి పరామర్శించారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న మాజీ మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని బడంగ్‌పేట్ ప్రజాభవన్‌లో రంగారెడ్డి జిల్లా జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా హాజరై మాజీ మేయర్ సర్టిఫికెట్లను ప్రదానం చేసి మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులను నేర్చుకున్న మహిళలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రామ్మోహన్, మాజీ కార్పొరేటర్లు నిమ్మల సునీతా శ్రీకాంత్‌గౌడ్, బోయపల్లి దీపికా శేఖర్‌రెడ్డి, నాయకులు గట్టు బాలకృష్ణ మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులు గణితం పట్ల ఆసక్తి పెంచుకోవాలి : ప్రిన్సిపాల్



తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిట్స్ గురించి వివరిస్తున్న మీర్‌పేట్ నారాయణ విద్యార్థులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 22 ప్రభాతవార్త:** భారతదేశం గర్వించతగ్గ ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థులు గణితం పట్ల ఆసక్తిని, ఇష్టాన్ని పెంచుకోవాలని మీర్‌పేట్ నారాయణ ఐటి పాఠశాల ప్రిన్సిపాల్ బాబ్జి పిలుపునిచ్చారు. సోమవారం పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నారాయణ డిజిఎం గోపాల్‌రెడ్డి, ఎజిఎం రవీంద్రబాబులు గణిత ప్రాజెక్ట్‌లను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజంలో మనిషి నిత్య జీవనానికి గణితానికి అవి నాభావ సంబంధం ఉందని తెలిపారు. గణిత ప్రాజెక్ట్‌ల ఎగ్జిబిషన్‌ను సందర్శించిన విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీస్తున్న నారాయణ పాఠశాల యాజమాన్యాన్ని అభినందించార. కార్యక్రమంలో ఎడి, ఎఒ, విపిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి కృషి : పరమేశ్వర్‌రెడ్డి



తెలంగాణ సీనియర్ సిటిజన్స్ క్యాలెండర్‌ను అవిష్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 22 ప్రభాతవార్త :** తెలంగాణ సీనియర్ సిటిజన్స్ క్యాలెండర్ సోమవారం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి అవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సీనియర్ సిటిజన్స్‌సంక్షేమ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల్ సీనియర్ సిటిజన్స్‌తో అనేక అంశాలు చర్చించారు. సీనియర్ సిటిజన్స్ కోసం చేపట్టాల్సిన సంక్షేమ పథకాలు,అభివృద్ది పనుల విషయాన్ని వారి దృష్టికి తీసుకుని వచ్చారు. సీనియర్ సిటిజన్లకు అన్ని విధాలుగా చేయూత అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నేతలు వెంకటయ్యగౌడ్, షేర్ నరసింహరెడ్డి, నారాయణ గౌడ్, పాపిరెడ్డి, ఎం.అంజి రెడ్డి, మందుముల అంజి రెడ్డి, వీరేశంగుప్తా, లింగారెడ్డి, పురుషోత్తంరెడ్డి, వెంకటేశం, పి.జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.57లక్షలతో ఇందిరానగర్‌లో సిసి రోడ్డు పనులు



రామంతాపూర్ ఇందిరానగర్‌లో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, డిసెంబరు 22 ప్రభాతవార్త :** రామంతాపూర్ ఇందిరానగర్‌లో రూ.57 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇందిరానగర్ కాలనీలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రత్యేకంగా సిసి రోడ్డు పనులు మంజూరు చేయించినట్లు తెలిపారు. డివిజన్‌లో దశలవారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. వచ్చే సంక్రాంతిలోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. పనుల విషయంలో నాణ్యత పాటించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ నాగమణి, ఎఇ మౌనిక, పలువురు కాలనీ సంఘం నేతలు పాల్గొన్నారు.